కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్,వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో) టమోటా లోకల్ 45, వంకాయ 23, బెండ 50, పచ్చిమిర్చి 60, కాకర 45, బీర 55, క్యాలీఫ్లవర్28, క్యాబేజీ 23, క్యారెట్ 40. దొండ 18, ఆలు 33, ఉల్లి 34, గోకర 45, దోస 28, సొర 11, పొట్ల 18, అరటి 11, చిక్కుడు 65, అర్వి 40, మునగ 55, చిలగడదుంప 55, బీట్‌రూట్ 25, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 85, కాప్సికమ్ 65. ఈధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

బండి సంజయ్‌కు నేతల అభినందనలు



సైదాబాద్: కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను బీజేపీ నేతలు సత్కరించి అభినందనలు తెలిపారు. ఆదివారం దేశ ప్రధాని నరేంద్రమోదీ సహా ప్రమాణ స్వీకారం చేసిన బండి సంజయ్‌ను సోమవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీలు మర్యాద పూర్వకంగా కలిసారు. ఆయనకు పూలబొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు

చాదర్‌ఘాట్: జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువైంది. ప్రజావాణిలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ పేర్కొన్నారు. సర్కిల్‌లోని ప్రజలంతా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూసీడీ, ట్యాక్స్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ చెక్‌పోస్టుల ఏర్పాటు

చాదర్‌ఘాట్: పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేసామని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు. సోమవారం స్టేషన్‌లో మాట్లాడుతూ, ఆవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారం రోజుల నుంచి పికెట్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఆటో ట్రాలీలు, డీసీఎంలు, లారీలను చెక్‌పోస్ట్‌లో నిఘాలో ఉండేట్లు సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. ఆవుల అక్రమ రవాణాపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. స్టేషన్ పరిధిలో అటు సైదాబాద్ పీఎస్, మలక్‌పేట పీఎస్‌లతో సమన్వయం చేసినట్లు తెలిపారు. 24 గంటల పాటు నిఘా ఏర్పాటు చేసి ఉన్నతాధికారులకు సమాచారం చేరవేస్తామన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసిన నూతన కమిటీ సభ్యులు

మన్సూరాబాద్: కాలనీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన సహారా స్టేట్స్‌కాలనీ మెయింటనెన్స్ వెల్ఫేర్ సొసైటీ కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన వెంకటాద్రి ప్యానల్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించి మాట్లాడుతూ కాలనీలో సుమారు కోటి రూపాయలతో బీటీ రోడ్లను వేశామన్నారు. మిగిలిన రోడ్లను వేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బహార్ పదవబ్లాక్ వద్ద వరద ముంపు సమస్యకు పరిష్కారం చూపాలని సభ్యులు కోరడంతో పరిశీలించి చర్యలు చేపడుతానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సయ్యద్‌జానీ, నాయకులు సుదర్శన్‌రెడ్డి, మేకల ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరావు, శేఖరయ్య, భీమానాయక్, మంజుల, శీనయ్య, ఎవీరావు, లత, అమర్ తదితరులు పాల్గొన్నారు.


గోవుల తరలింపు ఆపండి



డీసీపీకి వినతి పత్రమిస్తున్న బాలకృష్ణగౌడ్ గురుస్వామి

సైదాబాద్: నగరంలోని సౌత్‌ఈస్ట్ జోన్ పరిధిలో అక్రమంగా తరలించి తీసుకువస్తున్న వేలది గోవులను రక్షించాలని అఖిల భారత గోసేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి పోలీస్ అధికారులను కోరారు. ఈ మేరకు ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి సోమవారం ఆయన సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ డి.జానకిని ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోరక్షణ చట్టాలను పోలీసులు పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో గోసేవా ఫౌండేషన్ ప్రతినిధులు గోవర్ధన్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, రాఘవేందర్, మాణిక్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు



మారుతీ నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్

నాగోలు: వర్షా కాలంలో కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డుపై నీరు నిలువ వుండకుండా తగిన చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం కొత్తపేట డివిజన్ మారుతి నగర్‌లో కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వర్షాకాల సమయంలో వరద నీరు మొత్తం రోడ్డుపైనే నిలుస్తున్నాయని కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వరద నీటి సమస్య పైన తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలియజేయడంతో అతను వెంటనే అధికారులు స్థానిక ఏఈ మాతృనాయక్ పిలిపించి సమస్యను పరిశీలించారు. వర్షాకాలం సమయంలో వచ్చే వరద నీరు కాలనీలో రోడ్డుపై నిలువ వుండకుండా వుండేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా చూడాలని ఏఈ తెలియజేశారు. అవసరం అయితే ఈ సమస్యను పై అధికారులు దృష్టికి కూడా తీసుకెళ్తానని కాలనీలో వున్నటువంటి సమస్యను వివరిస్తామని అన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

ఇబ్బందుల్లో కాలనీవాసులు

హస్తినాపురం: జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని హస్తినాపురం డివిజన్ పరిధిలో గల నందనవనం కాలనీ, ఆదర్శ్‌నగర్‌కాలనీ, ఇంద్రసేనారెడ్డినగర్ తదితర ప్రాంతాలలో అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఇండ్ల మధ్యనే చెత్త పేరుకుపోయిందని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందలాది పేద కుటుంబాలు నివసించే ఈ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ ప్రాంతంలో పేద ప్రజలు నివసిస్తున్నారనే చిన్నచూపుతో అధికారులు వ్యవహరిస్తున్నారని ఆయాప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గత సంవత్సరకాలంగా తమ కాలనీలో సమస్యలు తాండవిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని తాము తమ గోడును ఎవరికి చెప్పుకున్నా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని వాపోతున్నారు. ఎంత మంది అధికారులు మారినా, తమ సమస్యలు మాత్రం ఆదేవిధంగానే ఉన్నాయని పేదప్రజలు ఇక్కడ నివసిస్తున్నందునే ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నందనవనం కాలనీ, ఆదర్శనగర్‌కాలనీ తదితర ప్రాంతాలలో ఎక్కడి చెత్త అక్కడే కుప్పలు తెప్పలుగా ఉండడంతో దోమలు చేరి తమకు అంటువ్యాధులు సోకుతున్నాయని ఇప్పటికైనా ఎల్‌బీనగర్ సర్కిల్ ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని ఆయాకాలనీల ప్రజలు కోరుతున్నారు.



హస్తినాపురంలోని నందనవనం కాలనీలో ఇండ్లమధ్య పేరుకుపోయిన చెత్త



నందనవనంకాలనీలో పిచ్చిమొక్కలు

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎల్‌బీనగర్: ప్రజావాణిలో స్వీకరించిన సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 6 ఫిర్యాదుల రాగా అందులో టౌన్ ప్లానింగ్ మూడు, ఇంజనీరింగ్ రెండు, పార్కులపై 1 ఫిర్యాదు వచ్చాయని పంకజ తెలిపారు.

హయత్‌నగర్ సర్కిల్‌లో నాలుగు..

హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో మొత్తం నాలుగు ఫిర్యాదులు వచ్చాయని సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య తెలిపారు.అందులో టౌన్ ప్లానింగ్ పై మూడు, ఫించన్లపై ఒక్క ఫిర్యాదు అందాయని అయన తెలిపారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



ప్రజావాణిలో సమస్యపై వినతి పత్రం తీసుకుంటున్న డీసీ యాదయ్య



జోనల్ కార్యాలయంలో సమస్యలను తెలుసుకుంటున్న జోనల్ కమిషనర్ పంకజ

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీ పురం కాలనీ ఫేజ్ 2 కాలనీ వాసులు తమ కాలనీ సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా కాలనీలో అనుమతి లేకుండా సెల్లర్ల నిర్మాణం, రోడ్లను అక్రమించి భవనాల నిర్మాణం చేపడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కాల్వా శ్రీధర్, ప్రధాన కార్యదర్శి పాశం విఠల్‌రెడ్డి, కోశాధికారి కొప్పుల జంగయ్యగౌడ్, ఉపాధ్యక్షులు సికిందర్, సభ్యులు బాకారం నర్సింహ్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సామ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదనపు నిధులు మంజూరు చేయాలి



జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డితో సమావేశమైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని శివారు కాలనీలలో నూతన భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి అదనపు నిధులు మంజూరు చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు.ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఎమ్మెల్యే జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో 80కిలో మీటర్ల నూతన వాటర్ పైప్‌లైన్‌తో పాటు రూ.50కోట్లతో యూజీడి పైప్‌లైన్ పనులను నిధులు మంజూరు చేశామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హమీ మేరకు శివారు కాలనీలలో యూజీడి పైప్‌లైన్ నిర్మాణం కోసం మరో రూ.20కోట్లు మంజూరు చేయాలని కోరామని వాటిని కూడా మంజూరు చేస్తే శివారు కాలనీలకు మేలు జరుగుతుందని తెలిపారు. నిధులు మంజూరు చేశామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని ఎండీ పేర్కొన్నారన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

మున్సిపల్ కమిషనర్‌కు బిల్ కలెక్టర్ల వినతి

ఇబ్రహీంపట్నం: చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న తమ జీతాలను పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆదిబట్ల మున్సిపల్ బిల్ కలెక్టర్స్ మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు సోమవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపాలిటీగా ఆవిర్భవించక ముందు నుంచి గ్రామ పంచాయతీల్లో బిల్ కలెక్టర్లుగా పని చేస్తున్నాం... మున్సిపాలిటీగా మారిన తర్వాత మా పరిస్థితులు మారుతాయని భావిస్తే అందుకు భిన్నంగా తయారయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 10 నుంచి 30 సంవత్సరాల సీనియార్టీతో పలువురు పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత కొరవడిందని... గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో బిల్‌కలెక్టర్లు పర్వతాలు, రాజశేఖర్, నరేందర్, సురేష్, రవీందర్, మల్లికార్జున్, స్వామి, మల్లారెడ్డి, సదానంద్ పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు వారు తెలిపారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బిల్ కలెక్టర్లు

అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి



ఇబ్రహీంపట్నం: అధికారులు అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. నగరంలోని తిరుమలహిల్స్‌లోని ఆయన నివాసంలో సోమవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల కోడ్ తొలగిపోవడంతో నియోజకవర్గంలో నిలిచిపోయిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. నిధుల సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.అన్నివిధాల తన సహాయ సహకారాలుంటాయ తెలిపారు.


న్యాయం చేయండి సారూ..

యాచారం: కబ్జాలో ఉన్న పట్టా భూమికి సర్టిఫికెట్లు ఇప్పించాలని మంతన్‌గౌరెల్లికి చెందిన బిక్కునాయక్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి విజ్ఞప్తి చేశారు. గతంలో బిక్కునాయక్.. ఇతరులు తనభూమి మీదకు వచ్చి ఇబ్బందులు పెడుతున్నారని యాచారం పీఎస్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన బిక్కునాయక్ మాట్లాడతూ.. ఏళ్లుగా పట్టా భూమిలో కబ్జాలో ఉన్నాం , పట్టా కోసం ధరణి పోర్టల్‌లో అర్జీ పెట్టుకున్నాం.. అయినా పట్టా సర్టిఫికెట్లు రావడం లేదని వాపోయారు. గ్రామస్తులు కొందరు ఆ భూమి తమదేనని కబ్జాలోకి వస్తున్నారని.. మీరే న్యాయం చేయాలి... లేదంటే ఇక్కడే చనిపోతానని ఎమ్మెల్యే ముందు వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులతో మాట్లాడి సర్వే చేయించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1983–84 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 40 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదిబట్ల మున్సిపల్ పరిధిలో గల ఓ ఫాంహౌస్‌లో 'రూబీ' పేరుతో పూర్వ విద్యార్థుల సమ్మేళన నిర్వహించుకున్నారు. దాదాపు 70 మంది పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. కేక్ కట్‌చేసి, కుర్రకారును తలపించే విధంగా మైక్‌సౌండ్ రికార్డుల మధ్య ఆటపాటలతో మైమరిచిపోయారు. సామూహిక భోజనాలు చేశారు. అనిల్‌కుమార్ అనే పూర్వవిద్యార్థి లండన్ నుంచి ప్రత్యేకంగా ఈ రూబీ వేడుకల్లో పాల్గొనేందుకు రావడం కొసమెరుపు. మరణించిన తోటి పూర్వ విద్యార్థుల ఆత్మశాంతికై రెండు నిమిషాలు మౌనం పాటించి అంజలి ఘటించారు. కార్యక్రమాన్ని సక్సెస్ చేసిన పలువురిని సత్కరించారు.

యోగాతో మానసిక ప్రశాంతత



ఉప్పల్ : ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని యోగా శిక్షకులు కరుణాకర్‌రావు అన్నారు. సోమవారం ఉప్పల్ లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా సాధికారిత యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు కరుణాకర్ రావు ఉపాధ్యాయులు, విద్యార్థులకు యోగా శిక్షణ ఇస్తూ దాని ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోసఫ్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో యో గా ప్రధాన పాత్ర అని ప్రతి నిత్యం యోగాను అభ్యాసం చేయాలని సూచించారు. మానసిక, శారీరక వికాసానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఒకప్పుడు యోగాపై ఎవరికి అవగాహన ఉండేది కాదని కానీ ఇప్పుడు యోగా విశిష్టతను తెలుసుకొని ప్రపంచస్థాయిలో అధికారులు యోగాను చేస్తున్నారన్నారు.

విద్యార్థులకు అన్నదానం, పండ్లు పంపిణీ



విద్యార్థులకు ఆహార పదార్థాలను వడ్డిస్తున్న అశ్విని ఆంజనేయులు

వనస్థలిపురం: కర్పూరి ఠాకూర్ సామాజిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశ్విని ఆంజనేయులు తన జన్మదినాన్ని పురస్కరించుకుని వనస్థలిపురంలోని శాంతినికేతన్ దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల పాఠశాల నిర్వాహకులు బాలేశ్వర్, బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పాండు యాదవ్, నాగరాజు, విజయ్‌కుమార్, నర్సింహులు, దేవేందర్, అరుణ్‌కుమార్, రాజు, రమేష్ పాల్గొన్నారు.


మలక్‌పేటలో బీజేపీ సంబరాలు



మూసారంబాగ్‌లో స్వీట్లు పంచిపెడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: మూడోసారి దేశ ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మూసారంబాగ్, అక్బర్‌బాగ్ లలో ఆదివారం రాత్రి బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి, ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. మోదీ హ్యాట్రిక్ సాధించడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మూసారంబాగ్ చౌరస్తాలో భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్, సీనియర్ నేతలు బొక్క మధుసూదన్‌రెడ్డి, మడిగెల లక్ష్మారెడ్డి, దేవేందర్, భరత్‌కుమార్, అంబబాయి, ఉదయ్ తదితరులు ఉన్నారు.

ఆటా మహాసభల్లో రామచంద్రరావుకు సన్మానం



దిల్‌సుఖ్‌నగర్: అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో అట్లాంటా జార్జియాలో జరుగుతున్న 18వ ఆటా మహాసభల్లో ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీకి చెందిన ఎస్‌ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రామచంద్రరావును సన్మానించారు. ఆయన చేస్తున్న పలు సేవ కార్యక్రమాలకు గుర్తించి ఆటా సభల నిర్వాహకులు రామచంద్రరావుకు మెమొంటోను అందజేసి ఘనంగా సన్మానం చేశారు. ఆటా అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ శ్రీనిలయ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న సంతోష, కృష్ణ దంపతుల కుమార్తె సీతాప్రనూష నీట్–2024లో 720 మార్కులకు గా ను 640 మార్కులు సాధించింది. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ సూర్లగంటి అర్జున్ కాలనీవాసులతో కలిసి సీతా ప్రనూ షను అభినందించి సన్మానించారు. ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువులు చదివి డాక్టర్‌గా స్థిరపడి ప్రజలకు సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనిలయ కాలనీవాసులు పాల్గొన్నారు.

వేధిస్తున్న సబ్జెక్టు టీచర్ల కొరత



కందుకూరులో ఫిల్లర్ల వరకే ఆగిన పాఠశాల గదుల నిర్మాణం

- మన ఊరు–మన బడి కింద 12 పాఠశాలలు ఎంపిక
- రూ.3.50 కోట్లు మంజూరు
- 10 పాఠశాలలో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన
- రెండు పాఠశాలలో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నత్తనడక పనులు

మహేశ్వరం: మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాభాభాగంగా మహేశ్వరం మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలలకు రూ.3.50 కోట్ల నిధులు గత ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులతో పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని రావిర్యాల బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల, తుక్కుగూడ ఉన్నత పాఠశాల, మంఖాల్ ప్రాథమిక పాఠశాల, మహేశ్వరం ప్రాథమిక పాఠశాల, మన్సాన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల, మొహబ్బత్‌నగర్ ప్రాథమిక పాఠశాల, నాగారం ఉన్నత పాఠశాల, అమీర్‌పేట్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, తుమ్మలూరు ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించిన మొత్తం 10 పాఠశాలలో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. తుక్కుగూడ, మొహబ్బత్‌నగర్ రెండు పాఠశాలలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అసంపూర్తిగా ఉన్నాయని త్వరలో పూర్తి చేయిస్తామని ఎంఈఓ కృష్ణ చెప్పారు.

ఇంకా పూర్తి కావాల్సి ఉంది..



మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా పాఠశాలల్లో కొన్ని మాత్రమే పనులు పూర్తయ్యాయి. ఇంకా పూర్తి కావాల్సినవి ఉన్నాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేయాల్సిన పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం విద్యార్థులకు సరిపడా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. యూనిఫాం కూడా స్థానికంగానే మహిళా సంఘాలు కుడుతున్నారు. పాఠశాలలు ప్రారంభం కాగానే అందరికీ పంపిణీ చేస్తాం.

– టి.మనోహర్, ఇన్‌చార్జి ఎంఈఓ, కందుకూరు

మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలలు

మండలంలో మొత్తం 56 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో ఉన్నత పాఠశాలలు–14, ప్రాథమిక పాఠశాలలు–29, ప్రాథమికోన్నత పాఠశాలలు–11, కస్తూర్బాగాంధీ పాఠశాల, మోడల్ స్కూల్ ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లుగా మొత్తం 170 మంది ఉపాధ్యాయులున్నారు. కొన్ని ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. సబ్జెక్టు టీచర్లు కావాలని డీఈఓకు విన్నవించామని ఎంఈఓ తెలిపారు.

కొనసాగుతున్న మౌలిక వసతులు

కందుకూరు: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించడానికి మన ఊరు–మన బడి పథకం కింద 18 పాఠశాలలు ఎంపిక చేయగా, ప్రస్తుతం 8 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగతా వాటిల్లో రంగులు వేయడంతో పాటు కొన్ని పనులు పూర్తి చేయాల్సి ఉంది. కందుకూరులో కాంట్రాక్టర్ సమస్యతో ఫిల్లర్ల వరకే నిర్మాణం ఆగింది. ధన్నారంలో స్థలం కొరతతో అదనపు గది నిర్మాణం చేపట్టనేలేదు. మన ఊరు– మన బడి పథకం కింద ఎంపికైన పాఠశాలలకు గత ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా ఉన్న సబితారెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించి పనులు చేయించారు. మీర్‌ఖాన్‌పేట, నేదునూరు జెడ్పీ పాఠశాలల్లో అమేజాన్ సంస్థతో అభివృద్ధి పనులు చేయించారు. కాగా, మిగిలిన పాఠశాలల్లో ఉన్న పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసి, ఒక్కో పాఠశాల అభివృద్ధికి రూ.1లక్ష కేటాయించి పనులు చేపట్టింది. మరుగుదొడ్లు, తాగునీరు, కరెంట్ పనులు, చిన్న చిన్న మరమ్మతులు చేపడుతున్నారు. చాలా పాఠశాలల్లో పనులు చివరి దశలో ఉన్నాయి. మొత్తం 53 పాఠశాలల్లో 4728 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు.

అధికారులు సేమ్.. రివ్యూలు రెండు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: పాలకుల మధ్య సమన్వయం లోపం కారణంగా సోమవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధికారులతో ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, బీఆర్‌ఎస్ కార్పొరేటర్లతో కలిసి క్యాంప్ ఆఫీస్‌లో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. అలాగే, మేయర్ చిగురింత పారిజాతరెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ మేయర్, అధికారులతో కలిసి రివ్యూ మీటింగ్ నిర్వహించారు. సబితారెడ్డి మాట్లాడుతూ.. గతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన పనుల పురోగతి గురించి ఆరా తీశారు. ముఖ్యంగా హెచ్‌ఎండీఏ, ఎస్‌ఎన్‌డీపీ నాలాలు, మెయిన్‌రోడ్లు, ఇంటర్నల్ రోడ్లు, స్ట్రీట్ లైటింగ్, తాగునీరు. ఇతర మౌలిక వసతుల గురించి చర్చించారు. అలాగే, మేయర్ పారిజాత అధికారులతో మాట్లాడుతూ.. ఈ ఏడాది రూ. 40 కోట్లతో చేసిన తీర్మానంలో ముఖ్యంగా రూ.12 కోట్లు డ్రైనేజీలకు, రూ.10 కోట్లు బీటీ రోడ్లకు, రూ.2 కోట్లు, కమ్యూనిటీ హాళ్ల కోసం రూ.1.70 కోట్లు, కేటాయించామన్నారు. ఇప్పటికే రూ.12 కోట్లు టెండర్ ప్రక్రియ పూర్తి అయింది. త్వరలోనే పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పేరుకుపోయిన నాలాలను వెంటనే శుభ్రం చేయాలన్నారు. ఈ రెండు సమీక్షా సమావేశాల్లో చర్చించిన అంశాలు వర్షాకాలం దృష్ట్యా ముందస్తుగా అధికారులను అప్రమత్తం చేయడం, అభివృద్ధి పనులపై చర్చించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సబితారెడ్డి, మేయర్ పారిజాత చెరొక పార్టీల్లో ఉండటం వల్లనే వేర్వేరుగా రివ్యూలు జరిగినట్లుగా తెలుస్తుంది.